సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం, 4, సెప్టెంబర్, 2023



సామర్థ్యాల మెరుగు కోసం..

గిరిజన విద్యాలయాల్లోని విద్యార్థుల్లో కనీస సామర్థ్యాల పెంపుపై ఐటీడీఏ నూతన పీఓ ప్రతీక్‌జైన్ దృష్టి సారించారు.

8లో



మూడో రోజు.. 925 మంది

ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఆదివారం మూడో రోజుకు చేరుకుంది.

10లో

గరిష్టం / కనిష్టం
$30^{\circ} / 24^{\circ}$

వాతావరణం

జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి విశేషపూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కుల చెల్లించారు. ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. పూజలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని చైర్మన్ కోరం కనకయ్య అధ్యక్షతన మంగళవారం జెడ్పీ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీఈఓ విద్యాలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు శాశ్వత ఆహ్వానితులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

8 నుంచి పోస్టర్ తయారీ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ లోకల్‌బాడీ, కేజీబీవీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ నెల 8న కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని వివరించారు. అంతర్జాలం, ఎలక్ట్రానిక్ పరికరాల సమర్థవంతమైన వినియోగం, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై పోస్టర్ తయారు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కావలసిన చార్టులు, రంగులు ఇతర సామగ్రి పిల్లలే తెచ్చుకోవాలని వివరించారు. విద్యార్థులు తమ పాఠశాలల ద్వారా ఈ నెల 6వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, గెలుపొందిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు.

లఘుచిత్రం ఆవిష్కరణ



లఘుచిత్రాన్ని విడుదల చేస్తున్న దర్శకుడు హరిప్రసాద్ తదితరులు

కొత్తగూడెంటౌన్: పట్టణానికి చెందిన న్యాయవాది, నటుడు, దర్శకుడు బొమ్మ హరిప్రసాద్ తాను రూపొందించిన ట్రయాంగిల్ లవ్‌స్టోరీ షార్ట్ ఫిలిం లోగోను ఆదివారం మేదరబస్తీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఘుచిత్రం ద్వారా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారి కష్టాన్ని వృథా చేయొద్దని, ప్రేమ పేరుతో మహిళలను వేధించొద్దనే సందేశం ఇస్తున్నట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా సామాన్యులకు చట్టాలపై అవగాహన పెంపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.కనకయ్య, వలస సత్యప్రసాద్, బొమ్మ మురళీకృష్ణ పాల్గొన్నారు.

'హైర్' డ్రైవర్లకు ప్రాధాన్యమివ్వాలి

మణుగూరు రూరల్: ఆర్టీసీ సంస్థ చేపట్టనున్న నూతన డ్రైవర్ల నియామకాల్లో హైర్ బస్ డ్రైవర్లకు తొలి ప్రాధాన్యమివ్వాలని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాజర్‌పాషా డిమాండ్ చేశారు. ఆదివారం పీవీ కాలనీ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఆర్టీసీ మణుగూరు డిపో హైర్ బస్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైర్ బస్ డ్రైవర్లకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని, ఆర్టీసీ ఆస్పత్రిలో ఉచిత వైద్యసౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం పలువురు హైర్ బస్ డ్రైవర్లు సంఘంలో పలువురు చేరారు. ఆ తర్వాత డిపో హైర్ బస్ డ్రైవర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఎం.నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా పెరుగు కుమార్, ఉపాధ్యక్షుడిగా అగ్గిరాజు, కార్యదర్శిగా లక్కీశివాజీ, కోశాధికారిగా గీత సందీప్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా జెట్టి నరసింహారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.సంతోష్‌కుమార్, కమిటీ సభ్యులుగా సంపంగి మల్లేష్, వీర ప్రవీణ్, అన్వేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగీలాల్, పెనుగొండ నాగార్జున, సాధనపల్లి రవి పాల్గొన్నారు.

సారథిలేని కమలం



- జిల్లా అధ్యక్షుడిని సస్పెండ్ చేసిన బీజేపీ
- మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు
- అధ్యక్ష పదవికి ఆశావహుల ప్రయత్నాలు
- పార్టీ భావజాలంపై అవగాహన ఉన్నవారికే అవకాశం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అభివృద్ధికి చిరునామా డబుల్ ఇంజన్ సర్కార్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా దూసుకుపోతున్న భారతీయ జనతా పార్టీకి జిల్లాలో ఇంజన్ కరువైంది. అసెంబ్లీ ఎన్నికలకు మూడు నెలల సమయం ఉందనగా అనూహ్య రాజకీయ పరిణామాల నడుమ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కోనేరు సత్యనారాయణ (చిన్ని)ని పార్టీ సస్పెండ్ చేసింది. దాదాపు రెండు వారాలు గడుస్తున్నా కొత్త అధ్యక్షుడిని నియమించడంలో ఆ పార్టీ తర్జనభర్జన పడుతోంది.

పార్టీకి ఊపు

కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో భారతీయ జనతా పార్టీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. కుంజా సత్యవతి, ఊకే అబ్బయ్య లాంటి మాజీ ఎమ్మెల్యేలు పార్టీలోకి రావడంతోపాటు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కోనేరు చిన్ని జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. కరోనా సంక్షోభ సమయంలో పార్టీ కేడర్ సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయే ప్రయత్నం చేసింది. పార్టీ పరంగా అగ్రనాయకులు ఎవరూ జిల్లాపై పెద్దగా ఫోకస్ చేయలేదనే చెప్పాలి. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి కొత్త ఊపును తెచ్చిన బండి సంజయ్ లాంటి నాయకులు, కిషన్‌రెడ్డి లాంటి టవర్ పర్సనాలిటీస్ తమ పర్యటనలను ఖమ్మం వరకే పరిమితం చేశారు. మరోవైపు గతేడాది కాలంగా కోనేరు చిన్ని సైతం పార్టీ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తూ వచ్చారు. చివరకు బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

త్వరలో మండలాధ్యక్షుల సమావేశం

కీలక సమయంలో పార్టీకి చుక్కాని వంటి జిల్లా అధ్యక్షుడు లేకపోవడం సరికాదంటూ క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. దీంతో సాధ్యమైనంత త్వరగా సమర్థుడైన వ్యక్తిని అధ్యక్షుడిగా నియమించాలంటూ జిల్లా ఇన్‌చార్జి ఏనుగు రాకేశ్‌రెడ్డితోపాటు జిల్లా రాజకీయాలపై పట్టున్న ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి గరికపాటి మోహన్‌రావుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. రాబోయే వారం పది రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తామంటూ అధిష్టానం నుంచి అభయం లభించింది. మండలాల నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలతో కూడిన కోర్ కమిటీ ద్వారా జిల్లా అధ్యక్షుడిని ఖరారు చేయాలని బీజేపీ నిర్ణయించింది.

ఆశావహులు వీరే..

జిల్లా అధ్యక్షుడిగా కొత్త వారిని నియమించే విషయాన్ని పార్టీ అగ్రనాయకత్వం పరిశీలిస్తోంది. జిల్లా అధ్యక్ష పదవి కోసం ఆసక్తి చూపిస్తున్న వారిలో బైరెడ్డి ప్రభాకర్, భూక్యా సీతారాంనాయక్, కేవీ రంగాకిరణ్, ఎర్రంరాజు, యడ్లపల్లి శ్రీనివాస్, సోమసుందరం తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో భూక్యా సీతారాంనాయక్, ఎర్రంరాజు ఇప్పటికే జిల్లా కార్యదర్శులుగా కొనసాగుతున్నారు. అధ్యక్ష పదవి కోసం యడ్లపల్లి శ్రీనివాస్ పార్టీ రాష్ట్ర స్థాయి నాయకత్వం దగ్గర తన వంతు ప్రయత్నాలు ఇప్పటికే కొనసాగిస్తున్నారు. ఇక రంగాకిరణ్ వంటి నేతలు పదవి బాధ్యతలు ఇస్తే తీసుకునేందుకు సుముఖంగా ఉన్నా లాబీయింగ్‌కు దూరంగా ఉంటున్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రాబోతుండటంతో అనుభవం ఉన్న వారిని పార్టీ పరిగణనలోకి తీసుకుంటే బైరెడ్డి ప్రభాకర్‌కు పరిస్థితులు అనుకూలంగా మారుతాయి.

సిద్ధాంతాలకు కట్టుబడే వారికే..

రాజకీయంగా ఎంతటి ఉద్దండులనే అంశం కంటే పార్టీ సిద్ధాంతాలు, భావజాలం పట్ల అవగాహన ఉన్నవారినే జిల్లా అధ్యక్షుడిని చేయాలంటూ పార్టీలోనే భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో హడావుడిగా జిల్లా అధ్యక్షుడిని నియమించే బదులు రాష్ట్ర స్థాయి నేతల్లో ఒకరికి పార్టీ బాధ్యతలను ఎన్నికల వరకు అప్పగించాలని ఆ వర్గానికి చెందిన నేతలు అంటున్నారు. దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణకు కట్టుబడి ఉండే వారిని ఎంపిక చేయాలంటూ తమ వాణిని ఇప్పటికే పార్టీ పెద్దలకు వివరించారు. మరి బీజేపీ అగ్రనాయకత్వం జిల్లా అధ్యక్షుడిని నియమించే విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటుందనే అంశం తేలాలంటే మరో రెండు వారాలు ఎదురు చూడాల్సిందే.

రామయ్యకు సువర్ణ పుష్పార్చన





వేడుకకు హాజరైన భక్తులు (ఇన్‌సెట్) నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలోని మూలమూర్తులకు అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

15న లక్ష్మీతాయారు అమ్మవారికి పుష్పాంజలి

శ్రావణ మాసంలోని ఐదో శుక్రవారం సందర్భంగా ఈ నెల 15న దేవస్థానంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారికి పుష్పాంజలి జరపనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలతో బేడా మండపంలో పుష్పాంజలి, మంత్రపుష్పం, విశేష భోగ నివేదన నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటరు నమోదుకు స్పందన

ప్రత్యేక క్యాంపుల్లో 7,916 నూతన దరఖాస్తులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపులకు విశేష స్పందన లభించింది. ఓటరు నమోదుకు కొత్తగా 7,916 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదివారం వివరాలు వెల్లడించారు. ఓటు తొలగింపునకు 1,359, మార్పులు, చేర్పులకు 3,426 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ, యువకులు నూతన ఓటరుగా నమోదు కావడం, మరణించిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడం, పోలింగ్ కేంద్రం లేదా ఇళ్లు మారిన ఓటరు చిరునామా మార్పు కోసం జిల్లావ్యాప్తంగా 1,095 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. గత నెల 26, 27 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల్లో నూతన ఓటరు నమోదుకు 4,041, తొలగింపునకు 557, మార్పులు, చేర్పులకు 1,820 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ప్రత్యేక క్యాంపులలో వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికల సంఘం పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రిటర్నింగ్ అధికారులకు, తహసీల్దార్లకు సూచించారు. గత నెల 21న ప్రకటించిన ఓటరు జాబితాను ప్రతిఓటరు పరిశీలించుకోవాలని అభ్యంతరాలుంటే ఈనెల 19 వరకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు.

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పరిశీలించారు. అశ్వారావుపేట, దమ్మపేట మండల పరిధిలోని నాచారం, రెడ్యాలపాడు, తొట్టిపంపు, గణేష్‌పాడు, బాలరాజుగూడెం, లింగాలపల్లి, జమేదార్‌బంజర, వడ్లగూడెం, అల్లిపల్లి గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను సందర్శించారు. ఓటరు నమోదు తీరు తదితర వివరాలను పరిశీలించి, బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అల్లిపల్లి గ్రామంలో అంతరాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలకు విశేష స్పందన వచ్చిందని లభించిందని తెలిపారు. పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్లు ముజాహిద్, కృష్ణప్రసాద్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, డీటీలు వీరభద్ర నాయక్, సుచిత్ర, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

11 నుంచి అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె

సూపర్‌బజార్(కొత్తగూడెం): కనీస వేతనాలు, క్రమబద్ధీకరణ, చట్టపరమైన హక్కుల సాధనకోసం ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ తెలిపారు. ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులు కనీసవేతనాలు, ఉద్యోగభద్రతకు నోచుకోవడం లేదని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, గ్రాట్యుటీ వంటి రిటైర్మెంట్ బెనిఫిట్లతోపాటు భీమా, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. జేఏసీ నాయకులు గోనె మణి, ఇంద్ర, రూప, చి.పద్మ, లలిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు
ప్రయత్నిస్తున్నారు



కన్వెన్షన్ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

- ఎన్నికల సమయంలో వచ్చేవారిని నమ్మొద్దు
- గత ప్రభుత్వాలు ఖమ్మాన్ని పట్టించుకోలేదు
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఆర్టీసీ కన్వెన్షన్ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ఖమ్మంమయూరిసెంటర్ : ఖమ్మంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు చాలా శక్తులు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నూతన బస్టాండ్ పక్కన ఆర్టీసీకి చెందిన 1.7 ఎకరాల స్థలంలో రూ.40 కోట్ల అంచనాతో నిర్మించనున్న ఏసీ కన్వెన్షన్ హాల్ కమ్ షాపింగ్ కాంప్లెక్స్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. 72 ఏళ్ల కాలంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఖమ్మంలో మరో బస్టాండ్ నిర్మాణానికి ఆలోచన చేయలేదని, నాటి పాలకులు, ప్రజాప్రతినిధులు దాని ఊసే ఎత్తలేదని అన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత తాను రవాణా శాఖ మంత్రిగా నియమితులైన తర్వాత బస్టాండ్ నిర్మాణానికి అహర్నిశలూ శ్రమించానని, కాంట్రాక్టర్ ఇబ్బంది పెట్టినా.. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నా బస్టాండ్ నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు వస్తున్నారని, మాయ మాటలతో ప్రజలను మోసం చేయాలని చూస్తారని, అలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌ను గద్దె దింపుతామని, బంగాళాఖాతంలో కలుపుతామని మాట్లాడుతున్న వ్యక్తి ఖమ్మంలో ఏ ఒక్క అభివృద్ధి పనికైనా శంకుస్థాపన చేశారా అని ప్రశ్నించారు. ఎక్కడైనా శిలాఫలకంపై ఆయన పేరు ఉందా అన్నారు. ఖమ్మం ప్రజలు చైతన్యవంతులని, ఇక్కడ వామపక్ష అభ్యుదయ భావాలతో ప్రజలు ఉన్నారని, వారంతా ఆలోచించాలని కోరారు. మంత్రిగా నాలుగేళ్లలోనే ఇంత అభివృద్ధి చేసుకున్నామని, మరోసారి అవకాశం వస్తే మరింతగా అభివృద్ధి చేసే వీలు కలుగుతుందని అన్నారు.

రాష్ట్రంలో రెండో ఆర్టీసీ కన్వెన్షన్ హాల్..

ఖమ్మం నూతన బస్టాండ్ పక్కన 1.7 ఎకరాల్లో రూ.40 కోట్ల అంచనాతో నిర్మించనున్న ఆర్టీసీ ఏసీ కన్వెన్షన్ హాల్ రాష్ట్రంలోనే రెండోదని మంత్రి పువ్వాడ అన్నారు. హైదరాబాద్‌లో కన్వెన్షన్ హాల్ ఉన్నా.. అది నాన్ ఏసీ అన్నారు. 2 వేల మంది కూర్చునేలా ఈ హాల్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ సంస్థపై భారం తగ్గించేందుకు ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి, సర్కారు ఖజానా నుంచి వేతనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఆస్తులను దోచుకుంటున్నారని కొందరు మాట్లాడుతున్నారని, సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతే రాష్ట్రంలో ఆర్టీసీకి కొత్త ఆస్తులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఒక్క ఖమ్మంలోనే నూతన బస్టాండ్ నిర్మాణం ద్వారా రూ.200 కోట్ల ఆస్తి సమకూరిందని, ఇక కన్వెన్షన్ హాల్ ద్వారా మరో రూ.100 కోట్ల ఆస్తి సమకూరనుందని తెలిపారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కరీంనగర్ ఈడీ వినోద్‌కుమార్, ఈడీ కమర్షియల్ కృష్ణకాంత్, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ ధనలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, డిప్యూటీ మేయర్ ఫాతిమ జొహరా, ఆర్టీసీ ఆర్‌ఎం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల వారికి అండగా ప్రభుత్వం

ఖమ్మంసహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల వారికి అండగా నిలుస్తోందని, ఈ క్రమంలోనే లెక్చరర్ల క్రమబద్ధీకరణ విషయంలో సీఎం కేసీఆర్ గొప్ప మనసు చాటుకున్నారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం జెడ్పీ హాల్‌లో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లు విజయ్, తిప్పెట కిషోర్ బాబు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ లిస్ట్‌లో అనర్హులు?

- అభ్యర్థుల ఎంపిక జాబితాలో అవకతవకలు
- గత జూన్‌లో 8 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- 'చైల్డ్ హెల్ప్‌లైన్' నియామకంలో అధికారుల ఇష్టారాజ్యం
- స్థానికత, రిజర్వేషన్ నిబంధనలు పాటించలేదని ఆరోపణలు

కొత్తగూడెంటౌన్: ఆరోపణలు వస్తున్నా జిల్లా శిశు సంక్షేమశాఖ (ఐసీడీఎస్) తీరు మారడం లేదు. నోటిఫికేషన్‌లో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన అధికారులు తాజాగా అభ్యర్థుల జాబితా ఎంపికలో కూడా పారదర్శకత పాటించలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వయోపరిమితి సడలింపు అవకాశం ఉన్నా వర్తింపజేయలేదని పలువురు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. జిల్లా సంక్షేమశాఖలోని చైల్డ్ హెల్ప్‌లైన్ విభాగంలో 8 పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు గత జూన్‌లో నోటిఫికేషన్ జారీ చేశారు. రెండేళ్ల కాలానికి ఈ నియామకాలు చేపడుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పోస్టు 1, సోషల్ వర్కర్, కౌన్సిలర్ పోస్టు 1, హెల్పర్ పోస్టులు 3, కేస్ వర్కరు పోస్టులు 3 చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు స్వీకరించిన అధికారులు గత నెల 31న ఐడీఓసీ కార్యాలయంలో అర్హులు, అనర్హుల జాబితాను నోటీస్ బోర్డులో అంటించారు. అయితే అర్హుల ఎంపిక జాబితాలో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. 8 పోస్టుల కోసం 379 మంది దరఖాస్తు చేసుకోగా, అభ్యర్థులను ఎంపిక చేసి జాబితా ప్రకటించారు. అర్హులను ఎంపిక చేయకుండా, అనర్హులని ఎంపిక చేశారని పేర్కొంటున్నారు. కాగా జాబితాపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 6 వరకు గడువు విధించారు.

రిజర్వేషన్‌లోనూ తిరకాసు

జిల్లా వ్యాప్తంగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు 35 ఏళ్ల వయసులోపు వారు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు మరో ఐదేళ్ల వయసు సడలింపు ఉంటుందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. 40ఏళ్ల లోపు వారు కూడా అర్హులేనని, కానీ జాబితాలో మాత్రం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 38 సంవత్సరాల వయసునే పరిగణనలోకి తీసుకున్నారని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఐసీడీఎస్ కార్యాలయం


నోటిఫికేషన్‌లోనే నిబంధనలు పాటించలేదు..

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు నోటిఫికేషన్ జారీలో నిబంధనలు పాటించలేదని ఆరోపణలు వచ్చాయి. ఐసీడీఎస్‌లోని కీలక అధికారి బంధువులైన ఇతర జిల్లాకు చెందిన వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమయ్యాయి. నోటిఫికేషన్‌లో లోకల్/నాన్ లోకల్ నిబంధన ప్రస్తావించలేదు. ఇవే పోస్టులకు ఇతర జిల్లాల్లో మాత్రం ఆయా జిల్లాల్లోని స్థానికులే అర్హులంటూ నోటిఫికేషన్లలో పేర్కొన్నారు. కానీ ఇక్కడమాత్రం స్పష్టంగా నిబంధనలు వెల్లడించలేదు. తాము అనుమానించినట్లే ఎంపిక జాబితాలో అవకతవకలు చోటుచేసుకున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. స్థానికేతరులైన తమవారితో భద్రాద్రి జిల్లాలో తాత్కాలిక చిరునామా చూపి దరఖాస్తు చేయించారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికే ఇద్దరు డీడబ్ల్యూఓలు సరెండర్

జిల్లా సంక్షేమశాఖపై కొంతకాలంగా అవినీతి, సక్రమంగా విధులు నిర్వర్తించరనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఇద్దరు డీడబ్ల్యూఓలను సరెండర్ చేశారు. ఇటీవల మరో అధికారికి బాధ్యతలు అప్పగించారు. సరెండర్ చేసిన అధికారి హయాంలో నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తులు స్వీకరించగా, ఇటీవల బాధ్యతలు చేపట్టిన మరో అధికారి అభ్యర్థుల వివరాలను పరిశీలించి జాబితాను నోటీస్‌బోర్డులో ఉంచారు. అధికారులు మారినా నియామక ప్రక్రియలో పారదర్శకత రాలేదని నిరుద్యోగులు ఆరోపిస్తున్నారు. నియామకాల్లో నిబంధనలు పాటించకపోవడంపై గతంలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నోటిఫికేషన్ రద్దు చేసి, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.


కొత్తగా నియామకాలు చేపట్టాలి



నోటిఫికేషన్‌లోనే లోకల్ నిబంధన అమలు చేయకుండా జిల్లా అభ్యర్థులకు అన్యాయం చేశారు. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీలకు వయోపరిమితి విషయంలో కూడా పారదర్శకతలేదు. తమ వారికి లబ్ధి చేకూరేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. నోటిఫికేషన్ రద్దు చేసి కొత్తగా నియామకాలు చేపట్టాలి.

–ముత్తావరపు జానకీరామ్, మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అభ్యంతరాలు తెలపాలి



జిల్లా సంక్షేమశాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ అభ్యర్థుల వివరాలను నోటీస్‌బోర్డులో పొందుపరిచాం. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలిపాలి. జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులకే అవకాశం ఉంటుంది. అనర్హుల వివరాలను కూడా నోటీస్ బోర్డులో పెట్టాం.

–స్వర్ణలత లెనినా, జిల్లా సంక్షేమశాఖ అధికారి

క్లుప్తంగా

బీటెక్ కోర్సులో రెండో దశ కౌన్సెలింగ్


మాట్లాడుతున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగుల పిల్లలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకతీయ యూనివర్సిటీ కొత్తగూడెంలో 2023 – 24 విద్యాసంవత్సరం బీటెక్ కోర్సులో ప్రవేశానికి సూపర్ న్యూమరరీ సీట్లకు రెండో దశ కౌన్సెలింగ్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎం జాన్‌ఆనంద్ తెలిపారు. ఆదివారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్ రెండు సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ రెండు సీట్లు మైనింగ్‌లో రెండు సీట్లు, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్‌లో రెండు సీట్లు ఉన్నాయని తెలిపారు. అడ్మిషన్ తీసుకోవడానికి సిద్ధంగా ఉన్న వారు నేరుగా కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఈనెల 6న కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

'రామచంద్రునిపేట' వివాదంపై చర్యలు

హెచ్ఎంకు షోకాజ్ నోటీస్

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న వివాదంపై ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టారు. హెచ్ఎంకు షోకాజ్ షోకాజ్ నోటీస్ జారీ చేయగా ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై ఇతర ఆశ్రమ పాఠశాలలకు పంపించారు. రామచంద్రునిపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో కొన్ని రోజుల కిందట విద్యార్థులతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలతో పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయినుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయం బయటకు పొక్కి ఐటీడీఏ అధికారులకు చేరడంతో ఏటీడీఓ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడంతో హెచ్ఎం వీరమ్మకు షోకాజ్ నోటీస్ జారీ చేయగా ఉపాధ్యాయినులు అరుణకుమారిని పెదముసిలేరు ఆశ్రమ పాఠశాలకు, అనుగ్నజ్యోతిని దమ్మపేట మండలం అంకంపాలెం ఆశ్రమ పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

చికిత్స అందించిన సీఆర్‌పీఎఫ్ వైద్య బృందం


క్షతగాత్రుడికి చికిత్స చేస్తున్న తరుణ్‌మాలిక్

చర్ల: మండలంలోని తిప్పాపురం సమీపంలో గల ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు గాయపడగా సీఆర్‌పీఎఫ్ వైద్య బృందం చికిత్స అందించింది. వివరాలిలా ఉన్నాయి. సరిహద్దున ఉన్న పామేడుకు చెందిన యువకుడు మచ్చా నవీన్ శనివారం రాత్రి చర్ల నుంచి పామేడుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. తిప్పాపురంలోని సీఆర్‌పీఎఫ్ క్యాంపు సమీపంలోని రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన సీఆర్‌పీఎఫ్ 151 బెటాలియన్ క్యాంపు అధికారులు అతడిని అక్కడి నుంచి హుటాహుటిన పామేడులోని సీఆర్‌పీఎఫ్ ఫీల్డ్ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యాధికారి తరుణ్‌మాలిక్ క్షతగాత్రుడికి చికిత్స చేశారు. తల కు నాలుగు చోట్ల కుట్లువేసి పామేడులో ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నవీన్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే వైద్యాధికారి తెలిపారు.


మట్కా జూదరుల అరెస్ట్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి మేదరబస్తీ ఏరియాలో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న నలుగురిని ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. త్రీటౌన్ సీఐ మురళి ఆదేశాల మేరకు సిబ్బంది మట్కా ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద మట్కా స్లిప్పులతో పాటు రూ.3,460 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కూసుమంచి: మండలంలోని జుజుల్‌రావుపేట శివారులో ఆదివారం జాతీయ రహదారిపై ఓ ద్విచక్రవాహనాన్ని కంటైనర్ ఢీకొట్టింది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. నేలకొండపల్లి గ్రామానికి చెందిన మైసా సైదులు (36) పనులు ముగించుకుని ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. పాలేరు సమీపంలో జాతీయ రహదారిపై ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న కంటైనర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కూసుమంచి ఎస్ఐ రమేశ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,026

సామర్థ్యాల మెరుగు కోసం..

- స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో సర్వేకు కసరత్తు
- 3 నుంచి 7 తరగతుల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- నూతన పీఓ చొరవతో త్వరలో అమల్లోకి..


దుమ్ముగూడెం మండలంలోని ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ (ఫైల్)

భద్రాచలం: కరోనా వైరస్ అన్ని రంగాలను కకావికలం చేసిందనే విషయం తెలిసిందే. విద్యారంగంపై కూడా పెను ప్రభావం చూపింది. ఆన్‌లైన్ తరగతలతో ప్రత్యక్ష భోధనకు దూరమైన విద్యార్థులలో కనీస సామర్థ్యాలు లోపించాయనేది ఇటు విద్యావేత్తలు.. అటు విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం. దీంతో గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులలో కనీస సామర్థ్యాలపై ఐటీడీఏ నూతన పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్‌జైన్ ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛంద సంస్థ భాగస్వామ్యంతో సర్వే చేపట్టి కనీస సామర్థ్యాలను పెంచేందుకు నడుం బిగించారు. గిరిజన విద్యార్థుల్లో ప్రాథమిక స్థాయిలోనే లాంగ్వేజీ, గణితంపై పట్టు బిగించేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు.

పీఓ ప్రతీక్‌జైన్ చొరవతో..

భద్రాచలం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు స్వీకరించిన ప్రతీక్ జైన్ గిరిజన విద్యపై దృష్టి సారించారు. దుమ్ముగూడెం, చర్ల ఇతర మండలాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సమయంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఆశ్చర్యపోయారు. 7వ తరగతి విద్యార్థులు సైతం ఇంగ్లిష్ చదవటం, రాయటంలో విఫలమవడం, గణితంలో బేసిక్ సూత్రాలు చెప్పలేకపోవటం గమనించారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమీక్ష జరిపి వారి వెనుకబాటుకు గల కారణాలను విశ్లేషించారు. గిరిజన విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే సామర్థ్యాలు లోపించటంపై దృష్టి సారించి, ఆ సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించారు.

'నాస్'తో అంచనా..

హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ 'కే12 యాక్టివిటీ అకాడమీ'సహకారంతో పీఓ ప్రతీక్‌జైన్ కార్యాచరణకు దిగారు. ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్‌ఈఆర్‌టీల ఆధ్వర్యంలో ఆమోదం పొంది, ఆ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో 'నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే (నాస్)'తో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లోని కనీస సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా ఆశ్రమ పాఠశాల్లో 3 నుంచి 7వ తరగతి వరకు, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3 నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను ఎంచుకున్నారు. అప్పర్ ప్రైమరీ స్థాయిలో విద్యార్థులను ఎంపిక చేయటం వల్ల హైస్కూల్ స్థాయిలో వారి విద్యను పటిష్టం చేయవచ్చని పీఓ సూచించారు.

రెండు జిల్లాల్లో 285 పాఠశాలల్లో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 50 ఆశ్రమ పాఠశాలల్లో 8,478 విద్యార్థులు, 211 జీపీ పాఠశాలల్లో 2,878 మంది, ఖమ్మం జిల్లాలో 10 ఆశ్రమ పాఠశాలల్లోని 1,309 మంది, 14 జీపీ పాఠశాలల్లో 194 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మొత్తంగా ఐటీడీఏ పరిధి రెండు జిల్లాలోని 285 పాఠశాలల్లో చదువుతున్న 12,859 మంది విద్యార్థులు ఈ సర్వే పరిధిలోకి రానున్నారు. మరో పది రోజుల్లో ఈ సర్వే నిర్వహించేందుకు అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో ప్రశ్నావళి, వివిధ రంగాల్లో విద్యార్థుల ప్రతిభను అంచనా వేసేందుకు దశల వారీగా ప్రోగ్రాంను రూపొందించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో వారి సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఒక్కొక్క విద్యార్థికి సుమారు 20 నిమిషాల సమయం కేటాయించనున్నారు.

కనీస సామర్థ్యాలు అవసరం



ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస సామర్థ్యాలు అవసరం. దీనిని గుర్తించేందుకే నాస్‌ను అమలులో పెడుతున్నాం. ప్రత్యేక అధ్యయన పత్రం రూపొందించి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయనున్నాం. గతంలో రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ఈ సర్వేతో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఐటీడీఏ పరిధిలో గిరిజన విద్యను పటిష్టం చేసేందుకు కసరత్తు చేస్తున్నాం.

– ప్రతీక్‌జైన్, ఐటీడీఏ పీఓ

పకడ్బందీగా సర్వే..

సామర్థ్యాలను అంచనా వేసే ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించేందుకు పీఓ ప్రణాళికలను రూపొందించారు. ఆశ్రమ పాఠశాలలు, జీపీ పాఠశాలల్లో విద్యార్థులను సర్వే చేసేందుకు గురుకులం, ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విధులు నిర్వహించనున్నారు. దశల వారీగా నిర్వహించేందుకు 150 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. మానిటరింగ్, అడ్మినిస్ట్రేటివ్, పీఎంఆర్‌సీ సిబ్బంది, ప్రిన్సిపాళ్లు సైతం ఇందులో భాగస్వాములు కానున్నారు. దీనికై మానిటరింగ్ అధికారులకు ఇప్పటికే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించిన అనంతరం పది రోజుల్లో ఈ సర్వే చేపట్టనున్నారు. సర్వే అనంతరం వెనుకబడిన విద్యార్థులకు మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. గ్రూపులుగా విభజించి సాధన, వర్క్‌బుక్స్ ద్వారా తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో మెరుగైన ఫలితాలను రాబట్టేందుకు అధికారులు కృషి చేయనున్నారు.

లీకేజీలతో నీరు కలుషితం

- ప్రబలుతున్న విష జ్వరాలు
- పట్టించుకోని అధికారులు


రైతుబజార్ సెంటర్‌లో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


బస్టాండ్‌కు వెళ్లే మార్గం, ప్రధాన రోడ్డులో లీక్ అయిన పైపులైన్

కొత్తగూడెంఅర్బన్: పాల్వంచ మండలం కిన్నెరసాని నుంచి కొత్తగూడేనికి సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోంది. దీనికి తోడు లక్ష్మీదేవిపల్లి మండలం మొదలుకొని కొత్తగూడెం పట్టణం వరకు అనేక చోట్ల పైపులైన్లు లీకేజీలు అవుతుండటంతో నీరు బురదమయంగా మారుతోంది. ఒక వైపు బురదమయంగా నీరు, మరో వైపు లీకేజీలతో నీరు కలుషితమై తాగడానికి వీలులేకుండా ఉంటోంది. ఆ నీరు తాగిన వారు విషజ్వరాలకు గురవుతున్నారు. ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటే కలుషిత నీటి వలనే జ్వరాలు వచ్చాయని వైద్యులు నిర్ధారిస్తున్నారు. కిన్నెరసాని నీరు సరఫరా చేసే ఫిల్టర్‌బెడ్ వద్ద రూ.5 లక్షలతో 500 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించడం, రామవరంలోని బయో మైనింగ్ వద్ద రూ.5 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి గత నెల జరిగిన కౌన్సిల్ ఎజెండాలో పెట్టి ఆమోదం తెలిపారు. ఇలా ప్రతి నెల కిన్నెరసాని పైపులైన్ల మరమ్మతులు ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్ల పేరుతో లక్షల రూపాయలు కేటాయించి, ఆ పనులను పాత కాంట్రాక్టర్‌కే ఇచ్చారు. అతను మళ్లీ నాసిరకంగా పనులు నిర్వహించడంతో లీకేజీలు ఏర్పడుతున్నాయి. బురదమయంగా సరఫరా అవుతున్న కిన్నెరసాని నీటిని ఫిల్టర్‌బెడ్‌లో అలం, ఇసుకతో శుద్ధి చేసిన అనంతరం పట్టణానికి సరఫరా చేయాల్సి ఉంది. కాని, శుద్ధి చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారు. కౌన్సిల్ సభ్యులు ప్రధాన సమస్యపై దృష్టి సారించకుండా, పాత పనులు, రద్దయిన పనులకు మళ్లీ బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని వృథా చేసేందుకు, జేబులు నింపుకునేందుకు మాత్రమే అడుగులు వేస్తున్నారు. దీంతో పాలకవర్గంపై పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధిపత్య పోరు, పనులు, కాంట్రాక్టులు దక్కించుకునేందుకు ముడుపులు చెల్లిస్తూ మున్సిపల్ ఆదాయానికి గండి పడేవిధంగా చేస్తున్నారు. దీనికి మున్సిపల్ అధికారులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు సహకరిస్తుండటంపై జిల్లా అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిత్యం లీకేజీ ప్రాంతాలివే..

కొత్తగూడెం పట్టణ పరిధి బస్టాండ్ సెంటర్‌కు వెళ్లే మార్గం ప్రధాన రోడ్డుపై కిన్నెరసాని పైపులైన్ లీక్ అయింది. అక్కడ నిత్యం నీరు బయటకు వస్తూ ఉండడం, ఆ నీటి పైనుంచి అన్ని రకాల వాహనాలు నిత్యం వెళ్తుండటంతో కలుషితం అవుతోంది. దీంతో పాటుగా గాజులరాజంబస్తీ ప్రధాన రోడ్డులో పలు చోట్ల, లక్ష్మీదేవిపల్లి ఫిల్టర్‌బెడ్ సమీపంలోని ప్రధాన రోడ్డులో రెండు ప్రాంతాల్లో లీకేజీలున్నాయి. వీటితో పాటుగా మధురబస్తీ, మరికొన్ని వార్డుల్లో ప్రధాన పైపులైన్ల లీకేజీలున్నాయి. అధికారులు చర్యలు చేపట్టి మరమ్మతులు చేయించాల్సిన అవసరముంది. శనివారం రాత్రి కొత్తగూడెం రైతుబజార్ సమీపంలోని ప్రధాన రోడ్డులో కూడా పైపులైన్ లీక్ అయింది. ఒక్కసారిగా బారీ శబ్దంతో పగిలిపోయింది. అక్కడి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యా రు. ఇలాంటివి భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది.

మర్రి.. కనిపించదేమో మరి..

మోడువారిన మర్రి చెట్టు



మండల కేంద్రంలోని ఈ మర్రిచెట్టుకు సుమారు 80 ఏళ్లు ఉంటాయని చెబుతుంటారు. ఈ చెట్టు ఉండటం వల్లనే ఈ ప్రాంతానికి మర్రిచెట్టు సెంటర్ అనే పేరు వచ్చింది. ఆ చెట్టు నీడలో ఎందరో సేదతీరారు. ఎందరెందరో సభలు, సమావేశాలు పెట్టుకున్నారు. ఒక ల్యాండ్ మార్క్‌గా ఉన్న ఆ చెట్టుకు ఏదో తెగులు సోకింది. ఆకులన్నీ రాలిపోయాయి. కొమ్మలన్నీ ఎండిపోయాయి. కాండంలో జీవం పోయింది. ఇక తొలగించడమే తరువాయి. అయితే, ఏళ్లుగా అక్కడ ఉన్న ఆ చెట్టు ఇక కనిపించదు కదా అని ప్రకృతి ప్రేమికులు మదనపడుతున్నారు. ఇక ఈ సెంటర్‌ను ఏమని పిలవాలోనని కొందరు చింతిస్తున్నారు. –సుజాతనగర్

డీసీఎం దగ్ధం.. క్లీనర్ సజీవ దహనం

డ్రైవర్ పరిస్థితి విషమం


ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

కూసుమంచి : ఖమ్మం – సూర్యాపేట జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కెమికల్ లోడ్‌తో వెళుతున్న డీసీఎం ప్రమాదవశాత్తు దగ్ధం కాగా డీసీఎం క్లీనర్ సజీవ దహనమయ్యాడు. డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా తుని నుంచి రసాయనం డ్రమ్ములతో హైదరాబాద్ శివారు చర్లపల్లి వెళుతున్న డీసీఎం.. కూసుమంచి మండలం గురువాయిగూడెం తండా వద్దకు రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డీసీఎంలో కెమికల్ డ్రమ్ములు ఉండడంతో మంటలు నిమిషాల వ్యవధిలోనే విస్తృతంగా వ్యాపించాయి. ఈ ఘటనలో క్లీనర్ వాసం ఆదినారాయణ (43) సజీవ దహనమయ్యాడు. డ్రైవర్ కుక్కశెట్టి వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. తీవ్ర గాయాల పాలైన డ్రైవర్‌ను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతిచెందిన క్లీనర్, గాయపడిన డ్రైవర్‌ది అనకాపల్లి మండలం రాయవరంగా పోలీసులు గుర్తించారు. కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై రమేష్‌కుమార్ వివరాల సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాస్పత్రిలో శిశువు మృతి

బంధువుల ఆందోళన


శిశువు మృతదేహం


కాన్పు గది వద్ద శిశువుతో ఆందోళన చేస్తున్న బంధువులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి చెందిన విషయం కలకలం రేపింది. మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ ఆంగోతు రాజాకు, శైలజకు ఏడేళ్ల కిందట వివాహమైంది. శనివారం సాయంత్రం శైలజకు నొప్పులు రావటంతో కొణిజర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఆదివారం ఉదయం ఖమ్మం పెద్దాస్పత్రికి రిఫర్ చేశారు. ఆమెను బంధువులు మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకొచ్చారు. సాధారణ కాన్పు కోసం వైద్యులు ప్రయత్నం చేయగా శిశువు మృతి చెందింది. నొప్పులతో బాధపడుతూ బ్లీడింగ్ అవుతున్నా వైద్యులు సాయంత్రం వరకూ పట్టించుకోలేదని గర్భిణి బంధువులు వాపోయారు. కాన్పు చేసిన తర్వాత శిశువు మృతి చెందినట్లు ప్రకటించారని, వైద్యులు నిర్లక్ష్యం వహించటం వల్లే శిశువు మృతి చెందిందని కన్నీరు మున్నీరుగా విలపించారు. సాధారణ కాన్పు కోసం అంటూ సాయంత్రం వరకూ తాత్సారం చేశారన్నారు. కాన్పు గది ఎదుట బంధువులు, గ్రామస్తులు నిరసనకు దిగటంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఆస్పత్రి వర్గాలను వివరణ కోరగా తమ నిర్లక్ష్యం ఏమీ లేదని బదులిచ్చారు.

గులాబీ పురుగు నివారణపై అవగాహన


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

తిరుమలాయపాలెం: పత్తి పంటలో వచ్చే గులాబి రంగు పురుగు నివారణకు రైతులు చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం మండలంలోని పిండిప్రోలు గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జాగృతి ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ప్రస్తుత సమయంలో పత్తిలో గులాబీ పురుగు వచ్చే అవకాశం ఉందని, దీనిని గమనించేందుకు లింగాకర్షక బుట్టలను ఉపయోగించి మూడు రోజుల పాటు 8 తల్లి రెక్కల పురుగులు పడితే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. గులాబీ పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్, క్లోరిపైరిపాస్, క్వినాల్‌ఫాస్ మందులను వాడాలని సూచించారు. వేసవి కాలంలోనే లోతైన దుక్కులు దున్నుకోవడం ద్వారా దీనిని నివారించవచ్చని చెప్పారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కొట్టివేయించుకోండి..

ఖమ్మంక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడి కేసులపాలైన వారు ఆదివారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే లోక్ అదాలత్‌లో రూ. వెయ్యి నుంచి రూ.2 వేలు జరిమానా కట్టి కేసులు కొట్టివేయించుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలకు ట్రాఫిక్ సీఐ–1 నంబర్ 87126 59210, సీఐ–2 నంబర్ 87126 59211, కోర్ట్ కానిస్టేబుల్ 94923 08874 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల రంగప్రవేశంతో వివాదం ముగిసింది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన దేవాలయాన్ని రెండు రోజుల కిందట ప్రారంభించారు. ఈ దేవాలయానికి సంబంధించి రెండు వర్గాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ప్రధాన సెంటర్‌లో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. అరుపులు, కేకలు, తోపులాట మధ్య వివాదం తారాస్థాయికి చేరుతుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు.

ఉత్తమ అధ్యాపకులుగా సత్యవతి, సురేష్‌బాబు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలకు చెందిన కామర్స్ అధ్యాపకురాలు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ.ఆర్.సత్యవతి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సురేష్ బాబు ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకిరుల్లా తెలిపారు. ఇద్దరు అధ్యాపకులూ కళాశాల న్యాక్ గుర్తింపులో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తమ సబ్జెక్టుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సదస్సుల్లోనూ పరిశోధనా పత్రాలను సమర్పించారని తెలిపారు. మంగళవారం గురు పూజోత్సవం సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో వీరు అవార్డులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ అధ్యాపకులను ప్రిన్సిపాల్, లెక్చరర్లతో పాటు సిబ్బంది అభినందించారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

అశ్వారావుపేటరూరల్: ఇంట్లో నిద్రిస్తున్న ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు ఆభరణాన్ని ఆదివారం అపహరించాడు. స్థానికులు, బాధితురాలి కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని కాలింగులబజారుకు చెందిన రాధిక ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న 32 గ్రాముల బంగారు తాడు లాక్కెళ్లాడు. మహిళ గట్టిగా కేకలు వేయగా, దుండగుడు పారిపోయాడు. చోరీకి గురైన ఆభరణం విలువ సుమారు రూ.1.60 వేలు ఉంటుందని, బాధితురాలు స్థానిక పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య


సింగరాజు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: మూడేళ్లుగా పంట దిగుబడులు లేక అప్పుల భారం పెరగడంతో యువ కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వడ్డెర రంగాపురం గ్రామానికి చెందిన డేరంగుల సింగరాజు(26) ఎనిమిది ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మూడేళ్లుగా వరి, పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఆయా పంటల్లో దిగుబడులు సరిగ్గా రాకపోవడంతో సాగుకు పెట్టిన పెట్టుబడి సైతం వెనక్కి రాకపోగా, అప్పుల పాలయ్యాడు. పంటల సాగు కోసం చేసిన అప్పులు చెల్లించలేకపోవడంతో, ఈ ఏడాది సాగు చేస్తున్న పత్తి పంటకు పెట్టుబడులు సైతం దొరకలేదు. అప్పుల భారం, పంట సాగుకు పెట్టుబడి పుట్టకపోవడంతో మనోవేదన గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య ఉషారాణి, తల్లి రాములమ్మ, మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతుడి బాబాయ్ డేరంగుల నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరంపై కేసు

ఖమ్మంఅర్బన్: నగరంలోని శ్రీనగర్‌కాలనీ రోడ్డు నంబర్–1కు చెందిన కె.హరిబాబు ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం సైబర్ కేసు నమోదు చేశామని సీఐ శ్రీహరి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. హరిబాబు గత జూలై 1న టెలిగ్రాం యాప్‌లో తన ప్రొఫైల్‌ను అప్‌లోడు చేశాడు. ఈ క్రమంలో గ్రూప్ ఆన్ అనే కంపెనీ పేరుతో 9 టికెట్లు వచ్చాయి. ఒక్కొక్కటి పూర్తి చేస్తే నగదు జమ అవుతుందని చెప్పారు. ఒకటి, రెండు సార్లు నగదు జమ చేశారు. జూలై 7న తన సెల్‌కు రూ.500 పంపమని మెసేజ్ వచ్చింది. 8వ తేదీన రూ.55,800, మరో ఖాతా నుంచి రూ.9,200 టికెట్ల కోసం అని ఫ్రీజ్ చేశారు. మళ్లీ మరో రూ.25 వేలు కావాలని అడగటంతో 1930 నంబర్‌కు కాల్ చేసి జూలై 8న కె.హరిబాబు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి తన నగదు ఇప్పించాలని హరిబాబు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ ఖమ్మంలో DTCP ప్లాట్ల రేట్లు : వైరా రోడ్ PT–8,000/- గజం, ధర్మస్థలి-12,800/- గజం, క్షేత్ర-12,600/- గజం, పృథ్వి- 10,800/-గజం, గొల్లగూడెం- 22,000/- గజం, బల్లేపల్లి- 19,100/- గజం, సంప్ర. 93993 42239, కాట్రపల్లి నాగరాజ్ [M-1221606]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788217]

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర ✆ 96590 57777 [M-10360]

Wanted

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221537]

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో ఖమ్మం/కొత్తగూడెంలో పని చేయుటకు మేనేజర్స్ & టీమ్ లీడర్స్ కావలెను. అర్హత : డిగ్రీ పైన. వ : 25 సం॥ పైన, జీతం : 15 వేలు+ఇన్సెంటివ్స్. 7780662996 [M-1221535]

■ స్టార్‌హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ కోసం మరియు పార్ట్‌టైం / ఫుల్ టైం జాబ్ కోసం సంప్రదించండి. కాట్రపల్లి నాగరాజ్, ఖమ్మం. 9399342239. [M-1221605]

■ ఖమ్మం రియల్ ఎస్టేట్‌లో మార్కెటింగ్ చేయుటకు ఔత్సాహికులు కావలెను. ప్రొఫెషనల్ ట్రైనింగ్ ఉచితంగా ఇవ్వబడును. ఇన్సెంటివ్, అర్హత 25 సం॥రాల పైబడి. 8341340900. [M-1221493]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :

ఖమ్మం	9010299957
	9705444182
కొత్తగూడెం	9010223783
పాల్వంచ	9705444183
భద్రాచలం	9951602914
మణుగూరు	9705944416
సత్తుపల్లి	9652868642
మధిర	9949927792

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పురాతన ఆలయాలకు 'శ్రీవాణి' వైభవం

ఏపీలో 176 పురాతన ఆలయాల పునరుద్ధరణ

తిరుమల: పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణం, హిందూ ధార్మిక ప్రచార, సేవా కార్యక్రమాలే లక్ష్యంగా శ్రీవాణి ట్రస్టు ముందుకు దూసుకుపోతోంది. భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఏపీలో 176 పురాతన ఆలయాలను పునరుద్ధరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 2,273 నూతన ఆలయాలు నిర్మించి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. అలాగే 501 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద ప్రతి నెల రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో పెద్ద ఎత్తున హిందూ ధార్మిక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

2019లో ట్రస్ట్ విధివిధానాలు ఖరారు:
నూతన ఆలయాల నిర్మాణం, పురాతన ఆలయాల పునరుద్ధరణ కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌ను ప్రారంభించింది. 2018 ఆగస్టు 18వ తేదీనే ట్రస్ట్‌ను అప్పటి ప్రభుత్వం ప్రారంభించినా విధివిధానాలు మాత్రం 2019 సెప్టెంబర్ 23వ తేదీ ఖరారు చేశారు. అప్పటి వరకు కూడా టీటీడీ ట్రస్ట్‌లకు సంబంధించి లక్ష రూపాయలపైగా ఇచ్చిన దాతలకు మాత్రమే దర్శన సౌలభ్యం కల్పించేది. మొదటిసారి రూ.10 వేలను శ్రీవాణి ట్రస్ట్‌కు విరాళంగా అందించిన భక్తులకు ఎలాంటి సిఫార్సు లేఖలు లేకుండా ప్రోటోకాల్ బ్రేక్ దర్శన సౌకర్యం కల్పించే విధానాన్ని ప్రవేశపెట్టారు. దీంతో శ్రీవాణి ట్రస్ట్‌కు భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

సెప్టెంబర్‌లో తిరుమలలో విశేష పర్వదినాలు



తిరుమల: కలియుగ వైకుంఠమైన తిరుమలలో సెప్టెంబర్‌లో విశేష పర్వదినాలను ఆదివారం టీటీడీ పీఆర్వో విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. సెప్టెంబర్ 7న గోకులాష్టమి, 8న ఉట్లోత్సవం, 17న బలరామ జయంతి, వరాహ జయంతి, తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, 18న వినాయక చవితి, ధ్వజారోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం, 22న శ్రీవారి గరుడసేవ, 23న శ్రీవారి స్వర్ణరథోత్సవం, 25న రథోత్సవం, 26న శ్రీవారి చక్రస్నానం, ధ్వజావరోహణంతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమాప్తం, 27న శ్రీవారి బాగ్ సవారి ఉత్సవం, 28న అనంత పద్మనాభ వ్రతం జరగనున్నట్లు వెల్లడించింది.

పేదల ఇళ్లు లూటీ!

- నిరుపేదల ఈడబ్ల్యూఎస్ గృహాలనూ వదలని చంద్రబాబు
- రూ.8,000 కోట్ల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు షాపూర్జీ పల్లోంజీకి
- దుబాయ్ దినార్‌ల రూపంలో ముడుపులతో దొరికిపోయిన బాబు
- వినయ్ నంగాలియా, విక్కీజైన్, అంకిత్ బలదూత కీలక పాత్ర
- షాపూర్జీ పల్లోంజీ నుంచి దొంగ ఇన్‌వాయిస్‌లతో నగదును బాబు పీఏకు చేరవేసిన ఆ ముగ్గురూ
- ఐటీ శాఖ నోటీసుల్లో వెలుగులోకి చంద్రబాబు నిర్వాకాలు
- రూ.118 కోట్లకు మినహా మిగిలిన వాటికి బాబు లేఖలు
- దీటుగా సెక్షన్లతో తిప్పికొడుతూ తాజాగా 153 సీ కింద ఐటీశాఖ నోటీసులు జారీ



చంద్రబాబుకు వివిధ మార్గాల్లో అందించిన రూ.కోట్లను కోడ్ భాషలో స్టీల్ టన్నులుగా పేర్కొంటూ మెయిల్‌లో దాచుకున్న షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి ముసుగులో తాత్కాలిక భవనాల నిర్మాణాల్లో అడ్డంగా దోచేసిన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు పేదల ఇళ్ల నిర్మాణాన్ని సైతం వదల్లేదు! రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను ఒకే నిర్మాణ రంగ సంస్థకు అప్పగించి భారీ మొత్తంలో దోపిడీకి వేసిన పథకం ఆదాయపు పన్ను శాఖ తాజాగా జారీ చేసిన 46 పేజీల సుదీర్ఘ నోటీసుల్లో బయటపడింది. తాత్కాలిక భవన నిర్మాణాల్లో డొల్ల కంపెనీల పేరుతో రూ.వందల కోట్లు స్వాహా చేసి పక్కా ఆధారాలతో దొరికిపోయిన చంద్రబాబు 'ఈడబ్ల్యూఎస్'పథకం కింద పేదల ఇంటి నిర్మాణాల్లో ముడుపులు కొట్టేసేందుకు ప్రణాళిక వేశారు. ఇదే విషయాన్ని షాపూర్జీ పల్లోంజీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 నవంబర్ 5న ముంబైలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో వెల్లడించాడు. తాత్కాలిక సచివాలయం భవనాలే కాకుండా రాష్ట్రంలో వివిధ నిర్మాణాలకు సంబంధించి 2018 డిసెంబర్ నాటికి సుమారు రూ.8,000 కోట్ల విలువైన కాంట్రాక్టులను షాపూర్జీ పల్లోంజీకి చంద్రబాబు అప్పగించినట్లు మనోజ్ వాసుదేవ్ తన వాంగ్మూలంలో పేర్కొన్నాడు. ఇందులో ఈడబ్ల్యూఎస్ హౌసింగ్ ప్రాజెక్టు కింద సుమారు రూ.7,000 కోట్ల విలువైనవి కర్నూలు, గుంటూరు, అనంతపురం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఉన్నట్లు తెలిపాడు. అమరావతిలో రూ.700 కోట్ల హౌసింగ్ ప్రాజెక్టును 2019 ఫిబ్రవరిలో కేటాయించారని, దీని తర్వాతే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తనను ఇంటికి పిలిచి ఆయన పీఏ శ్రీనివాస్‌తో టచ్‌లో ఉండాలని చెప్పారని, అంతేకాకుండా పార్టీ ఫండ్ రూపంలో కాకుండా డొల్ల కంపెనీల ద్వారా తనకు నగదు ఇవ్వాలని కోరినట్లు వాంగ్మూలంలో స్పష్టంగా పేర్కొన్నాడు. 2017లో షాపూర్జీ పల్లోంజీ 1.40 లక్షల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకోగా 2019 మార్చి నాటికి కేవలం 23 వేల ఇళ్ల నిర్మాణాన్నే పూర్తి చేసింది.

నగదు బదిలీలో ఆ ముగ్గురు.. కోడ్ భాషలో
సబ్ కాంట్రాక్టుల ముసుగులో డొల్ల కంపెనీలు హయగ్రీవా, అన్నై, షలఖ కంపెనీల ద్వారా అక్రమంగా నగదును చంద్రబాబు నాయుడుకు తరలించడంలో వినయ్ నంగాలియా, విక్కీ జైన్, అంకిత్ బలదూత కీలకపాత్ర పోషించినట్లు మనోజ్ వాసుదేవ్ పార్థసాని తన వాంగ్మూలంలో వెల్లడించినట్లు ఐటీశాఖ నోటీసుల్లో పేర్కొంది. వీరంతా బోగస్ కాంట్రాక్టుల ద్వారా నగదును చంద్రబాబు నాయుడు పీఏ శ్రీనివాస్‌కు చేరవేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు దుబాయ్‌లో దినార్‌ల రూపంలో చెల్లించినట్లు మనోజ్ వాసుదేవ్ అంగీకరించాడు. ఈ చెల్లింపులకు సంబంధించిన ఎక్సెల్ షీట్‌ను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నగదు బదిలీకి కోడ్ భాషలో హెచ్‌వైడీ అని అందులో ఉంది. విజయవాడకు విజయ్ అని, విశాఖపట్నంకు విష్ అని, బెంగళూరుకు బాంగ్ అని కోడ్ భాషల్లో నమోదు చేసుకున్న వివరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అడ్డగోలు వాదన ఆపి జవాబు చెప్పు!!
చంద్రబాబు అసంబద్ధ వాదనలను కట్టిపెట్టి ముడుపుల రూపంలో తీసుకున్న రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పి తీరాల్సిందేనని ఐటీ శాఖ తేల్చి చెప్పింది! ఐటీ శాఖ నోటీసులు జారీ చేసిన ప్రతిసారీ తన రాజగురువు రామోజీ తరహాలో ఏదో ఒక అభ్యంతరాన్ని తెరపైకి తీసుకొస్తూ దర్యాప్తు ముందుకు కదలకుండా చంద్రబాబు అడ్డుకుంటున్నారు. చంద్రబాబు ప్రతిసారి వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను ఐటీ శాఖ తోసిపుచ్చుతూ సహనంగా సమాధానాలిస్తోంది. ముందుగా రూ.118 కోట్లకు లెక్కలు చెప్పాలంటూ పూర్తి సాక్ష్యాధారాలతో మరోసారి సెక్షన్ 153 సీ కింద నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులతో పాటు మనోజ్ వాసుదేవ్ పార్థసాని (ఎంవీపీ), చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్‌లపై ఐటీ దాడుల సందర్భంగా స్వాధీనం చేసుకున్న ఎక్సెల్ షీట్లు, వాట్సాప్ మెస్సేజ్‌లు, ఈ మెయిల్స్, బ్యాంకు లావాదేవీల వివరాలతో పాటు వారు విచారణ సందర్భంగా ఆ నగదును చంద్రబాబుకు ఏ విధంగా చేర్చారో వెల్లడిస్తూ వివరాలను పొందుపరిచింది.

తప్పించుకుని తిరుగుతూ..

చంద్రబాబు స్క్రూటినీ కేసును హైదరాబాద్ ఇన్‌కమ్ ట్యాక్స్–4 ప్రిన్సిపల్ కమిషనర్ గతేడాది సెక్షన్ 127 కింద హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్–2(4)కు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి సెక్షన్ 153 సీ, 143(2)/142(1) కింద విచారణకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. దీనిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ 2022 అక్టోబర్ 10, అక్టోబర్ 27, ఈ ఏడాది జనవరి 31, జూన్ 20న చంద్రబాబు నాలుగు లేఖలు రాశారు. అసలు సెంట్రల్ సర్కిల్ కార్యాలయానికి సెక్షన్ 153 సీ కింద తనకు నోటీసులిచ్చే అధికారం లేదని వాదించగా దీన్ని తోసిపుచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే సెక్షన్ 127 కింద కేసు బదిలీ కాకుండానే సెంట్రల్ సర్కిల్ ఆఫీసు తనకు నోటీసులు ఇచ్చిందంటూ వాదించగా దానికి కూడా స్పష్టమైన ఆధారాలతో వివరణ ఇచ్చింది. దర్యాప్తులో సీజ్ చేసిన వివరాలను తనకు పూర్తిగా తెలియచేయలేదని ఒకసారి పేర్కొనగా అందులో తన పేరు ఎక్కడా లేదు కాబట్టి తనకు నోటీసులు వర్తించవంటూ మరోసారి చంద్రబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఐటీ శాఖ స్పందిస్తూ మనోజ్ వాసుదేవ్ పార్థసాని వద్ద సోదాల్లో సీజ్ చేసిన వస్తువుల వివరాలన్నీ మీకు (చంద్రబాబుకు) తెలియచేశామని, సీఎం హోదాలో కేటాయించిన కాంట్రాక్టుల నుంచి సబ్ కాంట్రాక్టుల రూపంలో ఎటువంటి పనులు చేయకుండానే నగదు చంద్రబాబుకు చేరినట్లు బలమైన ఆధారాలను సేకరించడంతో మీ అభ్యంతరాలను కొట్టి వేస్తున్నామని, పూర్తి వివరాలను మరోసారి అందచేస్తున్నామని, దర్యాప్తునకు సహకరించాల్సిందేనంటూ తాజా నోటీసుల్లో స్పష్టం చేసింది.

స్వైన్ 'ఫ్లో'



- వేగంగా విస్తరిస్తున్న వైరస్
- పదేళ్లలో దేశవ్యాప్తంగా 8,064 మంది మృతి.. 1.47లక్షల మందికి సోకిన వైరస్
- స్వైన్‌ఫ్లూపై తాజాగా నివేదిక విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- చలికాలం వరకు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా స్వైన్‌ఫ్లూ కేసులు నమోదవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా స్వైన్‌ఫ్లూపై ఓ నివేదిక విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2014 సంవత్సరం నుంచి ఈ ఏడాది జూలై వరకు అంటే దాదాపు పదేళ్లలో దేశవ్యాప్తంగా 1.47 లక్షల మందికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకింది. అందులో 8,064 మంది చనిపోయినట్టు కేంద్ర నివేదిక వెల్లడించింది. ఆ వివరాలను తెలంగాణ వైద్యారోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. 2015 సంవత్సరంలో అత్యధికంగా దేశంలో 42,592 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, అందులో ఏకంగా 2,990 మంది చనిపోయారు. ఆ తర్వాత అత్యధికంగా 2017లో 38,811 మందికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకగా, అందులో 2,270 మంది చనిపోయినట్టు కేంద్ర నివేదిక తెలిపింది. 2014లో మాత్రం 937 మందికి స్వైన్‌ఫ్లూ రాగా, 218 మంది చనిపోయారు. దేశంలో వాతావరణ పరిస్థితులు, తీసుకునే జాగ్రత్తలపైనే దాని విస్తరణ, మరణాలు ఆధారపడి ఉన్నాయని ఆ నివేదిక వెల్లడించింది.

ఈ ఏడు నెలల్లోనే 2,783 కేసులు
దేశవ్యాప్తంగా ఈ ఏడాదిలో ఈ ఏడు నెలల కాలంలో 2,783 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా, 52 మంది చనిపోయారు. గతేడాది దేశంలో 13,202 మందికి సోకగా, 410 మంది చనిపోయారు. ఇవిగాక కొందరు రోగులు నేరుగా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లడంతో అవి రికార్డుల్లోకి ఎక్కడంలేదని అంటున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు స్వైన్‌ఫ్లూ భయం పెట్టి వేలకు వేలు గుంజుతున్నాయి. చివరకు అక్కడ తగ్గకపోవడంతో కొన్ని కేసులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నట్టు వైద్యాధికారులు చెబుతున్నారు. స్వైన్‌ఫ్లూపై నిరంతర అవగాహన కల్పించడం, నియంత్రణ చర్యలు తీసుకోవడమే పరిష్కారమని నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ కిరణ్ మాదల చెబుతున్నారు.

తెలంగాణలో 8,561 కేసులు

సంవత్సరం	స్వైన్‌ఫ్లూ కేసులు	మరణాలు
2014	78	08
2015	2,956	100
2016	166	10
2017	2,165	21
2018	1007	28
2019	1388	22
2020	446	05
2021	09	-
2022	343	-
2023 జూలైదాకా	03	-

(తెలంగాణవ్యాప్తంగా ఈ పదేళ్లకాలంలో 8,561 మందికి స్వైన్‌ఫ్లూ సోకగా, 194 మంది మృతి చెందారని కేంద్ర నివేదిక తెలిపింది.)

జాగ్రత్తలే శ్రీరామరక్ష...

- గుంపులున్న చోట తిరగకుండా చూసుకోవాలి. గుంపుల్లో తిరిగితే ఒకరి నుంచి మరొకరికి స్వైన్‌ఫ్లూ వైరస్ సోకే ప్రమాదముంది.
- ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి. అవకాశముంటే రక్షణ కవచంగా గ్లౌవ్స్ తొడుక్కోవాలి.
- దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, అధిక జ్వరం ఉండి, స్వైన్‌ఫ్లూ అనుమానం వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- బీపీ, స్థూలకాయం, షుగర్, ఊపిరితిత్తుల సమస్యలున్న వారికి స్వైన్‌ఫ్లూ త్వరగా సోకే అవకాశముంది. కాబట్టి వారు జాగ్రత్తలు తీసుకోవాలి.

స్వైన్‌ఫ్లూ లక్షణాలు...

- తీవ్రమైన జ్వరం వస్తుంది. దగ్గు, జలుబు, ఒళ్లునొప్పులు ఉంటాయి. జ్వరం ఒక్కోసారి అధికంగా ఉంటుంది. తలనొప్పి కూడా తీవ్రంగానే ఉంటుంది.
- పిల్లల్లో కొన్ని సందర్భాల్లో తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్య ఎదురవుతుంది. ఒక్కోసారి చర్మం బ్లూ లేదా గ్రే కలర్‌లోకి మారుతుంది. దద్దుర్లు వస్తాయి. ఒక్కోసారి వాంతులు కూడా అవుతాయి. నడవడమూ కష్టంగానే ఉంటుంది.
- ఇక పెద్దల్లో అయితే కొన్ని సందర్భాల్లో శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఛాతీనొప్పి, కడుపునొప్పి కూడా ఉంటుంది. నిరంతరాయంగా వాంతులు అవుతాయి.

జిల్లా వార్తలు

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న పీఓ



పంచవటీ కుటీరంలో పీఓ, కుటుంబసభ్యులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి వారిని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించిన పీఓ.. వాటి విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత గోదావరిలో బోటింగ్ చేసి దుమ్ముగూడెంలోని ఎస్ఎల్ఎస్ పవర్ ప్రాజెక్టును పరిశీలించారు. విద్యుదుత్పత్తి గురించి ప్రాజెక్టు ఇంజనీర్ రామ్మోహన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ప్యాసింజర్ రైళ్ల రద్దు 10 వరకు పొడగింపు

ఖమ్మం మామిళ్లగూడెం : ట్రాక్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు ప్యాసింజర్ రైళ్లను మొదట ఈనెల 3 వరకు రద్దు చేయగా, తాజాగా ఆ గడువును ఈనెల 10 వరకు పొడిగించింది. ఈ మేరకు సీసీఐ జాఫర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విజయవాడ నుంచి ఖమ్మం మీదుగా నడిచే రైళ్లు 07755 డోర్నకల్ – విజయవాడ, 07756 విజయవాడ – డోర్నకల్, 07278 భద్రాచలం రోడ్ – విజయవాడ, 07279 విజయవాడ – భద్రాచలం రోడ్ ప్యాసింజర్ రైళ్లు మరో వారం పాటు రద్దు చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులు రైల్వేకు సహకరించాలని ఆయన కోరారు.

కిన్నెరసాని గేటు ఎత్తివేత

5వేల క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల

పాల్వంచరూరల్ : ఎగువన కురుస్తున్న వర్షాలకు కిన్నెరసాని జలాశయానికి వరదనీరు చేరుతోంది. 407 అడుగుల నీటినిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్‌లోకి ఎగువనుంచి 225 క్యూసెక్కుల నీరు రావడంతో ఆదివారం నీటిమట్టం 405.40 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన ఒక గేటు ఎత్తి 5వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. నది దిగువ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

మూడో రోజు.. 925 మంది



ఈవెంట్స్‌లో పాల్గొంటున్న అభ్యర్థులు

- కొనసాగుతున్న అగ్నివీర్ ర్యాలీ
- మెడికల్‌లో 350 మందికి అర్హత

ఖమ్మం స్పోర్ట్స్ : ఖమ్మం జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. ఈ ర్యాలీకి 1200 మంది హాజరు కావాల్సి ఉండగా, 925 మంది అభ్యర్థులు మాత్రమే ఈవెంట్స్‌లో పాల్గొన్నారు. ఇందులో 350 మంది మెడికల్‌లో అర్హత సాధించారు. చాలామంది అభ్యర్థులు 1600 మీటర్ల పరుగు పందెంలోనే వెనుదిరుగుతున్నారు. కాగా 9 ఫీట్ బ్రాడ్ జంప్, పుల్ అప్స్, జిడ్‌క్రాస్ బార్‌లో కొద్ది మంది మాత్రమే అర్హత సాధిస్తున్నారు. ఏ ఒక్క ఈవెంట్‌లో క్వాలిఫై కాకపోయినా వెంటనే మైదానం నుంచి బయటకు పంపిస్తున్నారు. ఇందులో దీనికోసం రెండేళ్లుగా ప్రాక్టీస్ చేసిన అభ్యర్థులు సైతం ఉండటం బాధాకరం. అయితే నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఎక్కడ తప్పు జరిగినా తక్షణమే సీసీ కెమెరాల్లో చూసి అభ్యర్థులకు న్యాయం జరిగేలా ఆదేశాలు తక్షణమే ఇస్తున్నారు.

దేశ సేవలో ముందుంటాం
దేశ సేవల్లో తాము సైతం ముందుంటామని, ఇందుకోసం తమ ప్రాణాలు పోయినా పర్వాలేదని అభ్యర్థులు గర్వంగా చెబుతున్నారు. అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన పలువురు ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు. ఈ రిక్రూట్‌మెంట్ పైనే మూడేళ్లుగా ఆశలు పెట్టుకున్నామని, ఎలాగైన ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ఉన్నామని అన్నారు. తల్లిదండ్రుల ఆశలను నేరవేర్చేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని చెప్పారు. అభ్యర్థుల మనోగతం వారి మాటల్లోనే..

మూడేళ్లు కష్టపడ్డా




ఆర్మీలో ఉద్యోగం సాధించేందుకు మూడేళ్లు ఎంతో కష్టపడ్డా. అందుకు తగిన ప్రతిఫలం వస్తే బాగుంటుంది. మా అమ్మ, నాన్నలు ఎంతో కష్టపడి చదివించారు. వారి ఆశలకు అనుగుణంగా కచ్చితంగా ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది. ఈవెంట్స్‌లో ఎక్కువ మార్కులు సాధిస్తా. మెడికల్‌లో కూడా సలువుగా నెగ్గుతా. – కె.లక్ష్మీనారాయణ, సిద్దిపేట

తప్పక ఉద్యోగం వస్తది




ఫిజికల్ టెస్ట్‌ల కోసం నిర్వహిస్తున్న పరీక్షల్లో తప్పక నెగ్గుతాననే నమ్మకం ఉంది. రెండేళ్లుగా కోచింగ్ సెంటర్‌లో ఈవెంట్స్ పట్ల బాగా శిక్షణ ఇచ్చారు. ఈవెంట్స్ బాగా చేసి అత్యధిక మార్కులతో ఉద్యోగం పొందుతాననే ధీమా ఉంది. మా ఊరు నుంచే ఎక్కువ మంది వచ్చాం. ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఈవెంట్స్‌లో లక్ష్యాన్ని సాధించి ఉద్యోగం పొందుతా.
–జి.అనిల్, నిర్మల్ జిల్లా

డబ్బు బాగా ఖర్చయింది




డబ్బులు బాగా ఖర్చు చేసి ఆర్మీ ర్యాలీకి వచ్చా. మాది చాల పేద కుటుంబం. నాకు ఉద్యోగం వస్తే తల్లిదండ్రులకు అండగా ఉంటా. సైన్యంలో పని చేయడమంటే నాకు ఎంతో ఇష్టం. ప్రాణం పోయిన పర్వాలేదు.. సైన్యంలో చేరేందుకు బాగా కష్టపడి వచ్చా. తప్పక విజయం సాధిస్తా. ఉద్యోగం వస్తే మా కష్టాలు తీరిపోతాయి. అమ్మానాన్నలను మంచిగా చూసుకుంటా.– ఆర్.వంశీ, నిజామాబాద్

మాసార్లు చెప్పినట్టుగా చేస్తా



కోచింగ్ సెంటర్‌లోని సార్లు ఏ విధంగా ఈవెంట్స్‌పై శిక్షణ ఇచ్చారో అదే విధంగా చేసి తప్పక ఆర్మీలో ఉద్యోగం పొందేందుకు కృషి చేస్తా. మా ఊర్లో అందరం శిక్షణ తీసుకున్నాం. కానీ అందరికంటే ఎక్కువగా ఈవెంట్స్ బాగా ప్రాక్టీస్ చేశా. మా అమ్మ నాన్నలు రోజూ కూలీ పనులకు వెళ్లి నన్ను చదివించారు. వారికి ఏ కష్టం రాకుండా చూసుకుంటా.
–ఎస్.వివేక్, పెద్దపల్లి

ఆర్మీలో ఉద్యోగం సంపాదిస్తా



ఆర్మీలో ఉద్యోగం పొందడం కోసం మా ఇంట్లో వాళ్లంతా కష్టపడ్డారు. వారి కోసమే నేను ఉద్యోగం సాధిస్తా. కోచింగ్‌కు, రోజు ఫ్రూట్స్, మంచి ఆహారం కోసం ఖర్చు బాగానే చేశా. ఇప్పటివరకు అన్ని ఈవెంట్స్‌లో మంచి మార్కులు వచ్చేలా ప్రాక్టీస్ చేశా. ఖమ్మంలో కూడా అదే రీతిలో ప్రాక్టీస్ చేసి ఉద్యోగం పొందాలనే ఆశతో ఉన్నా.
– అజ్మీర ప్రవీణ్, అసిఫాబాద్

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

ఒకరోజు ఆదాయం రూ.33,475

పాల్వంచరూరల్ : కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 519 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.18,475 ఆదాయం లభించింది. ,300 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.15వేల ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

ఉత్తమ రైతుగా అయిలూరి ఎంపిక



అవార్డు అందుకుంటున్న వెంకట కోటారెడ్డి

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన అయిలూరి వెంకట కోటారెడ్డికి ఉత్తమ రైతు పురస్కారం లభించింది. నూతన సాగు పద్ధతులైన డ్రమ్‌సీడర్, వరిలో నేరుగా వెదజల్లడం, సమగ్ర నీటి వాడకం, వ్యవసాయ విధానాలను పాటిస్తూ నికరాదాయం పొందుతూ తోటి రైతులకు ఆదర్శంగా నిలిచినందుకు గాను వెంకట కోటారెడ్డికి ఈ పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీ ఆడిటోరియం తొమ్మిదో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం నల్సార్ లా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కృష్ణదేవరావు, అగ్రికల్చర్ వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.వెంకటరమణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు కోటారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

యాదవుల రిజర్వేషన్లు పునరుద్ధరించాలి



అభిషేక్‌కు స్వాగతం పలుకుతున్న భద్రాచలం యాదవ సంఘం నాయకులు

భద్రాచలంఅర్బన్ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆర్మీ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో కొన్ని మార్పులు చేసి యాదవుల రిజర్వేషన్లు తొలగించడాన్ని నిరసిస్తూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన అభిషేక్ కుమార్ యాదవ్ 65 రోజులుగా సైకిల్‌యాత్ర చేపట్టారు. 11 రాష్ట్రాల్లో 2,100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి ఆదివారం భద్రాచలం చేరుకున్నారు. ఈ సందర్భంగా భద్రాచలం యాదవ సంఘం నాయకులు అభిషేక్ కుమార్‌కు బ్రిడ్జి సెంటర్ వద్ద ఘనంగా స్వాగతం పలికి, శాలువాతో సన్మానించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ.. రిజర్వేషన్లను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం పట్టణ అధ్యక్షుడు జెట్టి రామకృష్ణ, నాయకులు గోసుల శ్రీనివాస్ యాదవ్, మొగిలి కనక రాజు, సాంబశివరావు, గోనె సుధాకర్, అచ్యుత్‌యాదవ్, పండు యాదవ్, నక్క సతీష్, నాగరాజు, ఈశ్వర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విజేత యూబీఐ



కప్ అందుకుంటున్న విజేతలు

ఖమ్మంగాంధీచౌక్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ఆధ్వర్యాన వరంగల్ నిట్ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన జీనియస్ జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో ఖమ్మం యూబీఐ రీజియన్ విజేతగా నిలిచింది. ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్ బ్యాంక్ రీజియన్ల స్థాయిలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 500 మంది విద్యార్థులు పాల్గొనగా ఈ పోటీల్లో ఖమ్మం యూనియన్ బ్యాంక్ రీజియన్ విన్నర్స్ అండ్ రన్నర్స్ విభాగాలను గెలుచుకుంది. విన్నర్స్‌గా కోదాడకు చెందిన తేజ స్కూల్ విద్యార్థులు రెహానా, మిథున సాయి నిలవగా.. రన్నర్స్‌గా ఖమ్మం హార్వెస్ట్ స్కూల్ విద్యార్థులు లలిత సాయి గుప్తా, జసరాజ్ నిలిచారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ జోనల్ హెడ్ హైదరాబాద్ కె.భాస్కర్‌రావు, ఖమ్మం రీజియన్ హెడ్ ఎ.హనుమంతరెడ్డి, వరంగల్ డీజీఎం రీజియన్ హెడ్ పి.సత్యం తదితరులు పాల్గొన్నారు.